క్లుప్తంగా

నిషేధం ఎత్తేయాలి..

పార్వతీపురం: డిజిటల్ వార్తా సంస్థ 'ది వైర్' వెబ్‌సైట్‌ను ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం కేంద్రం ప్రభుత్వం నిషేధించిందని, ఈ చర్యను సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను గౌరవించాలని, భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించాలని, ప్రజల సమాచార హక్కుకు కట్టుబడి ఉండాలన్నారు. విమర్శనాత్మక, స్వతంత్ర స్వరాలపై కేంద్రం అసహనం, రాజకీయ వివక్ష చూపడం సరైంది కాదన్నారు. కేంద్రం పునరాలోచన చేసి ది వైర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్ర సాధన సమితి సదస్సు రేపు



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

సీతానగరం: పార్వతీపురం ఎన్జీవో హోంలో ఈ నెల 12న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర సాధన సమితి సదస్సును విజయవంతం చేయాలని సమితి వ్యవస్థాపకుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన శనివారంమాట్లాడారు. ఉత్తరాంధ్ర సాధన సమితి ద్వారా రైతులు, ఉద్యోగుల సమస్యల నిమిత్తం అనేక పోరాటాలు చేస్తుందన్నారు. సమితి ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవం ఎన్జీవో హోంలో 12వ తేదీ ఉదయం 12 గంటల నుంచి నిర్వహించనున్నట్టు తెలిపారు. సదస్సులో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నువ్వు చేను కూడిక పనుల్లో రైతులు నిమగ్నం



నువ్వు కంకుల నుంచి నువ్వులు తీస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని వేసవి పంటల సాగులో భాగంగా రైతులు నువ్వు పంట కూడిక పనుల్లో నిమగ్నమయ్యారు. గత ఖరీఫ్ వరి సాగు చేసిన భూముల్లో మాగాణి భూముల్లో దుక్కులు చేసి వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. మెట్టు పెసర, మినుము, నువ్వు చేను, మొక్కజొన్న, రబీ వరి పంటలు సాగు చేశారు. వీటిలో నువ్వు పంట కలిసొచ్చింది. కోశీపేట, అంటిపేట, ఆర్ వెంకంపేట, రామవరం, రెడ్డివానివలస, లచ్చయ్యపేట, పెదంకలాం, సుమిత్రాపురం గ్రామాల్లో నువ్వు చేను కూడిక పనుల్లో శనివారం రైతులు బిజీగా కనిపించారు. ప్రస్తుతం కేజీ నువ్వులు రూ.90ల వంతున కొనుగోలు చేస్తుండడంతో కల్లాల్లో, మడుల్లో చేను ఆరబెట్టి కూడిక పనులు చేస్తున్నారు.

తల్లిని మించిన దైవం లేదు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

పాలకొండ రూరల్: తల్లిని మించిన దైవం లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరీ అన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చే పిల్లల తల్లులను వారి తల్లులను గౌరవించారు. చిన్నారులచే పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎస్.హేమప్రభ, టి.దివ్య, యు. కల్పన, శారద, గణపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ విత్తనాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు

సీతంపేట: సంప్రదాయ విత్తనాల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండలంలోని జగతపల్లిలో రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. హైబ్రిడ్ విత్తనాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ విత్తనాలైన రాగులు, జొన్న, కొర్రలు వంటి పంటలు సాగుచేసుకోవాలన్నారు. దుంపలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. జంగిగూడ, సొంబురునాయుడుగూడ, దీనబరిగూడ గ్రామాల నుంచి 56 మంది రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్.ఆనంద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పండగ ముందు పనులు చేయలేం..!



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిలిచి ఉన్న పారిశుద్ధ్య పనుల కోసం వినియోగిస్తున్న వాహనాలు

- పనులు చేయించాల్సిన అధికారులు చేతులెత్తేశారు..
- అధికార పార్టీ నేతల తాత్సారమే కారణమని చర్చ



శనివారం మధ్యాహ్నం తాళాలు వేసి ఉన్న మున్సిపల్ కార్యాలయం

సాలూరు:

శ్యామలాంబ అమ్మవారి పండగ ముందు పట్టణంలో చేపట్టాల్సిన పనులు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. రూ.2కోట్ల అప్పు డబ్బులతో చేయాల్సిన పనులకు ఈ నెల 9న టెండర్లు పూర్తయ్యాయి. అయితే ఈ టెండర్లను కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. పండగకు కేవలం వారం రోజులే సమయం ఉన్న క్రమంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి వాటిని ఆమోదించి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పరిస్థితి కనిపించడం లేదు. పండగ వరకు ఎటువంటి సెలవులు ఎవరికీ ఉండవని ఇటీవల జరిగిన సమావేశంలో అధికారులు తెలిపారు. అయితే రెండో శనివారం అధికార యంత్రాంగం ఎవ్వరూ కనిపించలేదు. పారిశుద్ధ్య పనుల కోసం అదనపు సిబ్బందిని నియమించామని తెలిపిన అధికారులు శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించే వాహనాలన్నీ నిలిపి ఉండడాన్ని స్థానికులు చర్చించుకుంటున్నారు. వారం రోజుల్లో పండగ జరుగనుండగా అధికార యంత్రాంగం తీరుకు ఇది ఒక నిదర్శనమని గుసగుసలాడుకుంటున్నారు.

- పండగ తరువాతే పనులు

రూ.2 కోట్ల అప్పు డబ్బులతో చేపట్టాల్సిన 77 పనులకు సంబంధించి 49 పనులకు టెండర్లు వచ్చినట్టు తెలియవస్తుంది. అయితే కేవలం వారం రోజుల వ్యవధిలో ఈ రోడ్లు, కల్వర్టులు, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలు వంటి పనులు పూర్తి చేసే అవకాశం లేనట్టే కనిపిస్తుంది. దీనితో పండగ తరువాతే ఈ పనులు చేసే దిశగా అధికారులు ఆలోచనలు చేస్తున్నట్టు తెలియవస్తుంది.

గ్రాంట్లు రాలేదు.. అప్పు డబ్బులే అయినా...

బుడా నుంచి రూ.కోటిన్నర గ్రాంటు తీసుకువచ్చామని దానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని, తరువాత కాదు కాదు రూ.కోటి 5 లక్షలు వచ్చాయని దానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రెండు పర్యాయాలు తెలపగా అధికారులు ఆ విధంగానే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఆ నిధులు రాని క్రమంలో పండగ ఏర్పాట్లపై ఆందోళన పెరిగింది. ఎట్టకేలకు రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు నిధులు విడుదల కావడం తో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గల బీపీఎస్–2019, ఎల్‌ఆర్‌ఎస్ –2020 నిధుల నుంచి సాలూరుకు ఈ ప్రభుత్వంలో రూ. 2 కోట్లు అప్పుగా (రీయింబర్స్‌మెంట్ పద్ధతిపై) నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పండగ ముందు పనులు చేపడతారని అందరూ భావించారు.

పండగ తరువాతే పనులు చేపడతాం

పండగకు వారం రోజులే సమయం ఉంది. రూ.2 కోట్లతో చేపట్టాల్సిన పనులు ఇప్పుడు చేసే పరిస్థితి లేదు. పండగ తరువాత పనులు చేపడతాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 77 పనులకుగాను 49 పనులకు టెండర్లు వచ్చాయి.

– కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్, సాలూరు.

తాత్సారం చేసిందెవరు?

అయితే మార్చిలో ఈ నిధులు వచ్చినా ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడంపై చర్చలు నడుస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అధికార కూటమి ప్రభుత్వ పెద్దలు తాత్సారమేనని పలువురు మట్లాడుకుంటున్నారు. కూటమి పెద్దలు వారి అనుచరులతో చర్చించి చేపట్టాల్సిన పనులపై మల్లగుల్లాలు పడ్డారని చర్చ నడుస్తుంది. కేవలం 20 రోజుల క్రితమే ఆ పనులు తుది జాబితాను సదరు పెద్దలు, అధికారులకు ఇవ్వడం జరిగిందని వార్త జోరుగా ప్రచారం జరుగుతుంది. దీని వలన అధికారులు ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. పైగా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ.. మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు.

కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటాం..



శేఖర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జమదాల గ్రామంలో భూపతి శేఖర్ అనే కార్యకర్తకు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు శనివారం శేఖర్ స్వగ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన వెంట పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి, మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బి.రవికుమార్, బి.వాసుదేవరావుతో పాటు కార్యకర్తలు ఉన్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ



పాడి పశువులను పరిశీలిస్తున్న డాక్టర్ దీనకుమార్

సీతానగరం: పశు వైద్య శాఖ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశు దాణా(50 కేజీలు) ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్టు ఆ శాఖ ఏడీ డాక్టర్ సిహెచ్ దీనకుమార్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో పలు పశువులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతానగరం పశు వైద్య సబ్ డివిజన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం మండలాల్లో 25 వేల పశువులు ఉన్నాయన్నారు. వీటిలో ఎక్కువ శాతం పశువులు సరైన దాణా లేక అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. ఆరోగ్యకరంగా పశువులను తయారు చేసేందుకు రూ.1110ల విలువైన పశు దాణా 50 శాతం రాయితీపై రూ.555లకే పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్యే



కుట్టు శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో కురుపాంలోని ఎంపీపీ స్కూల్–2 వద్ద ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధి కాంక్షిస్తూ బీసీ మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. 120 మందికి కురుపాంలో శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 96 మందికి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొండయ్య, వెంపటాపు భారతి, హిమరిక సుబ్బలక్ష్మి, విష్ణుకుమార్, శిక్షణ సంస్థ ప్రతినిధి జి.రాజేష్ పాల్గొన్నారు.

సీహెచ్‌వోలను బెదిరించడం సరికాదు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

సాలూరు: సమ్మె చేస్తున్న సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించకుండా, షోకాజ్ నోటీసులు ఇచ్చి వారిని బెదిరించి రాష్ట్ర ప్రభుత్వం లొంగదీసుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు అన్నారు. సాలూరులో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, 23 శాతం జీతం పెంచాలని తదితర డిమాండ్లతో వారు సమ్మె చేస్తున్నారని అన్నారు. వారితో చర్చలు జరిపి సమస్య పరిష్కరించకుండా, షోకాజ్ నోటీసులు ఇచ్చి బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు టీచర్లు వారి సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తే, ఇదే తరహాలో మంత్రులు బెదిరించారన్నారు. ప్రభుత్వం ఇకపై ఇటువంటి చర్యలను మానుకోవాలన్నారు. సీహెచ్‌వోలతో చర్చలు జరిపి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయనతో ఆ సంఘ నాయకులు గౌరురాజు, సింహాద్రి ఉన్నారు.

కుదిరిన ఒప్పందం.. విరమించిన సమ్మె



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

పార్వతీపురం: పార్వతీపురం ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత మూడు రోజుల నుంచి చేస్తున్న సమ్మెను శనివారం విరమించి విధుల్లో చేరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు, యూనియన్ ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేందుకు, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించారు. పండగ సెలవులలో ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమించి విధులలో చేరారు. సమ్మెలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, ఆర్టీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు టుంపిరాము, సీఐటీయూ నాయకులు వై.మన్మధరావు, బి.వి.రమణ, జి.సూరిబాబు, వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగ దరికి చేరిన గోవులు



వేసవి తాపం ప్రజలతో పాటు మూగ జీవాలకు తాకింది. తమ గొంతు తడుపుకునేందుకు మూగజీవాలు ఎక్కడ చెరువు కనిపిస్తే అక్కడకు చేరుకుంటున్నాయి. ఆ నీటితో తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. సాలూరు మండలం పెదపధం గ్రామ సమీపంలో శనివారం మేతకు వెళ్లిన ఆవులు అక్కడ ఉన్న చెరువు దగ్గరకు ఒక్కసారిగా వెళ్లడం సాక్షి కెమెరాకు చిక్కింది. తమ దాహార్తిని తీర్చుకున్న తరువాత మళ్లీ మేతకు పయనమయ్యాయి. – సాలూరు

సారాతో వ్యక్తి అరెస్ట్

పాలకొండ: సారా తయారు చేస్తున్న, విక్రయిస్తున్న వారిపై దాడులు చేపడుతున్నట్టు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సీతంపేట మండలం కొండగూడ గ్రామ సమీపంలో సారా తయారు చేస్తున్న సవర బాలరాజును శనివారం ఉదయం అరెస్ట్ చేశామని తెలిపారు. ఇదే సమయంలో సవర వెంకయ్య, సవర బాలిమ్మ, సవర రవికుమార్ తప్పించుకున్నారన్నారు. నిందితుల నుంచి 60 లీటర్ల సారాతో పాటు 2,560 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు, 1,950 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్సై హను మాన్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

లేబర్ కోడ్ చట్టాలతో తీరని నష్టం

బొబ్బిలి: కార్మిక లోకం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకురావడం అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. శనివారం పట్టణంలోని దర్గ సెంటర్ వద్ద జీపు జాతా కార్యక్రమం చేపట్టారు. ఈ జాతాను మెటల్ ఫ్రైక్ ర్యాలీతో ప్రారంభించారు. లేబర్ కోడ్‌చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పు జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, అంగన్‌వాడీల సంఘం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, పి.లక్ష్మణరావు, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



వాహనాన్ని పరిశీలిస్తున్న పట్టణ ఎస్‌ఐ జగదీష్‌నాయుడు



ఆటో పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ బి.సంతోషికుమారి



మక్కువ: వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్.ఐ వెంకటరమణమూర్తి

పార్వతీపురం రూరల్:

జిల్లా వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్లలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు శనివారం నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం శివారులోని వెంకంపేట గోలీల జంక్షన్ వద్ద పట్టణ ఎస్ఐ జగదీష్‌నాయుడు నేతృత్వంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు అంతర్ రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను పరిశీలించారు. విశాఖ నుంచి ఒడిశా ప్రాంతానికి, ఒడిశా నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిపోయే వాహనాలను, వాటి పత్రాలను పరిశీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువలో...

మక్కువ: స్థానిక శ్రీదేవి కాలనీ జంక్షన్ సమీపంలో ఎస్.ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలను శనివారం నిర్వహించారు. మండల కేంద్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించారు. ప్రతి వాహనాన్ని, వాహన పత్రాలను, బోడకుల వివరాలను ఆరా తీశారు. సరైన వాహన పత్రాలు కలిగి ఉండని వారిపై అపరాధ రుసుము విధించారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని వాహన చోదకులకు వివరించారు. శిక్షణ ఎస్సైలు గోపి, నాగరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం, వెంకంపేట, పెదమరికి, ఆర్కే బిల్డింగ్‌వలస తదితర గ్రామాల కూడళ్ల వద్ద ఎస్ఐ బి.సంతోషికుమారి నేతృత్వంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. పోలీసు

వేసవి దుక్కులు ఎంతో మేలు..



భూమిలో ట్రాక్టర్‌తో చేపడుతున్న దుక్కు

భామిని: పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 65,875 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ప్రస్తుతం రైతన్నలు ఖరీఫ్ సాగు కు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి దుక్కుల వల్ల కలిగే లాభాలను వివరించేందుకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్, రబీ పంట కోతల తర్వాత మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తుంటారు. దుక్కి లేకుండా విడిచి పెట్టడం వల్ల పిచ్చిమొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు పెరిగి భూమిలోని తేమను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. దీని ఫలితంగా భూసారం తగ్గిపోతుంటుంది. అలాగే భూమిని దున్నకుండా ఖాళీగా ఉంచడం వల్ల భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. అంతే కాకుండా మిది పోషకాల కొరత ఏర్పడి తర్వాత పంటలకు అత్యధిక మోతాదుల్లో ఎరువులు వేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెంది, తర్వాత వేసే పంటలకు తీవ్ర నష్టం చేకూరుస్తాయి.

లోతు దుక్కులపై దృష్టి సారించాలి..

ఈ నష్టాలను అధిగమించడానికి వేసవిలో లోతు దుక్కులు మీద రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీని వల్ల వేసవిలో కురిసే వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చు. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే మట్టిపెళ్లలు మెత్తపడతాయి. వర్షాలు పడిన తర్వాత నీరు బాగా ఇంకడం వల్ల అవసరమైతే మరోసారి దున్ని, వెంటనే విత్తుకునే అవకాశం ఉంటుంది. కొయ్యనాగలి, పెద్ద మడక, మౌల్డ్ బోర్డ్ నాగలి, పళ్లపు నాగలి, కొయ్యల బాతు కాళ్ల నాగలి వంటి పరికరాలను లోతు దుక్కులను ఉపయోగించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

భూసారం పెంపు..

వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. దీంతో భూమి కోతకు గురవ్వదు. భూమిలో చేరిన దుక్కుల వల్ల భూమి పైపొరలు కిందకు, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో తేమశాతం పెరుగుతుంది. పంట వేర్లు కూడా ఎక్కువ లోతుకు వెళ్తాయి. దీని వల్ల వర్షాధార పంటలు కీలక దశలో బెట్టకు తట్టుకుంటాయి. లోతు దుక్కుల వల్ల ఆకులు, మొక్కల భూమిలో కలిసిపోయి సేంద్రియ ఎరువు తయారవుతుంది. అలాగే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల వృద్ధి చెంది భూసారం మరింత పెరుగుతుంది.